బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలి

కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓబీసీ మహిళా సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతిగౌడ్ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చట్టసభలలో మహిళలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 50శాతం సబ్ కోటా కల్పించాలన్నారు. ఈ డిమాండ్‌తో మార్చి 18, 19వ తేదీల్లో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే జాతీయ బీసీ మహిళా సదస్సులో మహిళా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలనేతలు, పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించే విషయమై తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. బీసీ మహిళల సబ్ కోటాకు రాజ్యాంగబద్ధంగా రక్షణ కల్పించాలని కోరారు. కాలయాపన చేయకుండా వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించే బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. దేశవ్యాప్త జనగణనలో కుల గణన చేపట్టాలని కోరారు.

ముషీరాబాద్ మండల ట్రస్మా నూతన కమిటీ

ముషీరాబాద్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ముషీరాబాద్ మండలం నూతన కమిటీని అసోసియేషన్ సీనియర్ గౌరవ అధ్యక్షుడు వెంకటేష్ ప్రకటించారు. ముషీరాబాద్‌కు చెందిన రేడియట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్ భక్తియార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ట్రస్మా ప్రధాన కార్యదర్శిగా అంకం శ్రీకాంత్, కోశాధికారిగా టి.మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడిగా నీలం సంజీవ్‌తో పాటు పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

మార్చి 9న అఖిలభారత పద్మశాలి మహాసభ

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి మహాసభ ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూపాసదాశివ్ తెలిపారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో మహిళా ప్రతినిధుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. మహాసభలకు మహిళలు గ్రామస్థాయి నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

మహా ప్రజా ప్రదర్శన విజయవంతం చేయాలి

ముషీరాబాద్: రేవంత్ సర్కార్ ఆరు గ్యారంటీలను, ఏడో గ్యారంటీ అయిన ప్రజాపాలనను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈనెల 20న సుందరయ్య పార్క్ నుంచి ఉదయం 11గంటలకు మహా ప్రజా ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ ప్రదర్శన ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మీదుగా ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నా చౌక్‌కు చేరుకుంటుందన్నారు. ఈ ధర్నాకు పార్టీ అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు అధ్యక్షతన వహిస్తారని తెలిపారు. సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ముషీరాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ సూచించారు. బుధవారం హనుమాన్ దేవాలయం ప్రాంతంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్‌గౌడ్, సాల్వేరు సత్యనారాయణ, సోమ వెంకటేష్, సందీప్, దుర్గం బాలు, రుద్ర రవీందర్, జలమండలి అధికారి వెంకటేశం పాల్గొన్నారు.

ఎస్సార్టీ క్వార్టర్స్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ వేడుకల్లో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్



హిమాయత్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి



యువతకు స్ఫూర్తి.. ఛత్రపతి శివాజీ

ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

జై భవానీ..

చిక్కడపల్లి: హైందవ జాతిని జాగృతం చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం జోన్ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నమస్కరించారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్‌లో బీజేపీ నేత బండారి భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ పావని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందవి స్వరాజ్ స్థాపనే ధ్యేయంగా పోరాడారని అన్నారు. నేటి యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రకాష్‌యాదవ్, సురేష్, ఆనంద్‌రావు, మైఖేల్, ప్రశాంత్, డేవిడ్, సతీష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చూపిన మార్గంలో యువత నడవాలి..

నల్లకుంట: రత్నానగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలోని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. శివాజీ చూపిన మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు పి.ఈశ్వర్, మురళీకృష్ణ, పోచాలు, సతీష్ చంద్రగౌడ్, పాతకోటి మహేష్, శ్రీనివాస్, దూసరి వెంకట్‌గౌడ్, మహేందర్‌యాదవ్, వీరస్వామి, రఘు, రాజేష్ లాల్, బీరప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ..

కాచిగూడ: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం హిమాయత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ హిమాయత్‌నగర్ డివిజన్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకల్లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జై భవాని.. జై శివాజీ అని నినాదాలు చేశారు. స్ఫూర్తి ప్రదాత శివాజీ మహారాజ్‌ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు అనీష్ గంగపుత్ర, దిలీప్ రాజిరెడ్డి, అశోక్, ప్రభాకర్‌గౌడ్, ఎండీ సర్ఫరాజ్, తాజ్‌ఖాన్, మల్లేష్, సయ్యద్ జుబేర్, మహేందర్, విశ్వంత్, అజార్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ పాలన నేటి తరానికి స్ఫూర్తి: ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: ఛత్రపతి శివాజీ మహారాజ్ సాగించిన ప్రజారంజక పాలన నేటి తరానికి స్ఫూర్తి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ ఈ సేవా చౌరస్తా వద్ద బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బీఆర్‌ఎస్ నేతలు వెంకట్, రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, సయ్యద్ అస్లాం, నాగులుయాదవ్, శివానందగౌడ్, గురుదీప్‌సింగ్ పాల్గొన్నారు.

జై శివాజీ..

ఆశయ సాధనకు పాటుపడాలి: రచనశ్రీ

కవాడిగూడ: ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం దోమలగూడ బండానగర్‌లో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కార్పొరేటర్ జి. రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్ హాజరై ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.ఆంజనేయులు, సలంద్రి దిలీప్‌యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, బొల్ల రామేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో రత్నానగర్ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు



రాంనగర్ ఈ సేవా చౌరస్తాలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



బందానగర్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్

ఏపీ గ్రూప్-2 అభ్యర్థుల నిరసన

చిక్కడపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దాకే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న పలువురు అభ్యర్థులు నగర కేంద్ర గ్రంథాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు సురేష్, అంజన్, సీహెచ్ శాంతిలత, విజయదుర్గ, షేక్ హసీనాలు మాట్లాడుతూ ఏపీలో కొత్త ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దకుండానే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించడానికి సిద్ధం కావడం సరికాదన్నారు. ఏపీలో గ్రూప్స్, మెయిన్స్ పరీక్ష కోసం సిద్ధమైన సుమారు 92,250 మంది అభ్యర్థులు అయోమయంలో ఉన్నారని తెలిపారు. రోస్టర్ విధానాన్ని సరిచేసి నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం



బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్

ముషీరాబాద్: రాంనగర్ బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా నోహా మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ చర్చి ఎండీ డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. శాంతి మార్గంలో నడిచేందుకు బైబిల్ దైవవాక్యాన్ని అనుసరించే విధంగా కృషి చేయాలని సూచించారు. 78 సంవత్సరాలుగా ఏసు ప్రభు సేవల్లో బాప్టిస్ట్ చర్చి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి ప్రసిడెంట్ డాక్టర్ ఏబీ ఇమానియేల్, కార్యదర్శి ఇసాక్, కోశాధికారి ప్రభాకర్, చర్చి పాస్టర్, రెవరెండ్ జాన్ శరత్‌బాబు, విజయ్, దేవిడ్‌రాజు, జయకుమార్, మోజెస్, సైమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఉద్యమకారులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 250 గజాల ఇంటి స్థలాన్ని, నెలకు రూ.30వేల గౌరవ వేతనాన్ని ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులకు జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమంలో పనిచేసిన కళాకారులను సాంస్కృతిక సారథిలోని వివిధ పోస్టుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు ఆరోగ్య బీమా, అర్హులైన కుటుంబాలకు సంక్షేమ నిధిని అందించాలని కోరారు. ప్రతి జిల్లాలో అమరులైన ఉద్యమకారులకు స్మారక భవనం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోమన్న, యాదగిరి, చంద్రన్న, ప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీకేంద్రంలో జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి

ట్రాన్స్‌జెండర్స్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి



ట్రాన్స్‌జెండర్స్ సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్స్ వెల్ఫేర్ అకాడమీని ఏర్పాటు చేయాలని టీపీఎస్‌కె రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ట్రాన్స్‌జెండర్స్, టీపీఎస్‌కే ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అత్యంత వివక్షకు గురతున్న ట్రాన్స్‌జెండర్స్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి విడదీసి ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్స్ ఇజ్రా వెల్ఫేర్ అకాడమీని ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాన్స్‌జెండర్స్ ఆరోగ్య సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 32మందికి ట్రాఫిక్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశారన్నారు. అర్హత కలిగిన వారందరికీ అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ నాయకులు ప్రియా, నగ్మా, హారతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌జీవోస్ తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి లోకేష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఇతర శాఖ భారాన్ని ఆయనకు వివరించామని తెలిపారు. అనంతరం డైరీ, కేలండర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫోరం కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షులు మల్లేశం గౌడ్, వేమారెడ్డి, బాలరాజు, కె. మధుకర్‌రెడ్డి, ఎస్ఎం రామ్ విహార్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శికి వినతి పత్రం సమర్పిస్తున్న సందిల బలరాం

ఫ్లైఓవర్ ప్రారంభ జాప్యానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లే కారణం

కాచిగూడ: అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో జాప్యం జరగడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరే ప్రధాన కారణమని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భూసేకరణ అంశానికి ప్రాధాన్యం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం లేదన్నారు. కానీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సర్వీస్ రోడ్డు భూసేకరణలో తీవ్ర జాప్యం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం బ్రిడ్జి ప్రారంభమయ్యే విధంగా చూడాలన్నారు. ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. కల్యాణలక్ష్మి పథకం కింద 47మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు కార్పొరేటర్ ఉమారాణితో కలిసి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.సంధ్యారాణి, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బలీశ్వర్, శేర్‌సాగర్, బి.భీమ్‌రాజ్, వీఆర్‌ఓ మధు తదితరలు పాల్గొన్నారు.

25 నుంచి కురవి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

కాచిగూడ: కురవి శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ వరకు జరుగుతాయని శ్రీవీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. బుధవారం కాచిగూడలోని సేవా సమితి కార్యాలయంలో బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. సేవా సమితి ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరన్న ఆలయం వద్ద మహా అన్నదాన, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు 25న అంకురార్పణ, 26న శ్రీస్వామివారి కల్యాణోత్సవం, మార్చి 1న తెప్పోత్సవం, 3న రథోత్సవం, 4న బండ్లు తిరుగుట, 5న వసంతోత్సవం, 6న పవళింపు సేవ, 10న పార్వతిరామలింగేశ్వర స్వామివారి కల్యాణం, 12న పదహారు రోజుల పండుగ జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయ శాఖ ఈవో, అర్చకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. నగరం నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తోందని తెలిపారు.

సుందరయ్య పార్కు అభివృద్ధికి కృషి చేస్తున్నాం



సుందరయ్య పార్కులో జరిగిన వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో పీవీ నిరంజన్‌రెడ్డి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కును దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్ రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ సహకారంతో రెండు నెలల కాలంలోనే పార్కులో విద్యుత్ దీపాలు, టాయిలెట్లు వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపట్టామని తెలిపారు. దోమల నివారణకు చర్యలు తసుకుంటున్నామని పేర్కొన్నారు. బుధవారం సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వారంలో రెండుసార్లు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. యోగా తదితర కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దశరథ్, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, వెంకటకృష్ణారావు, కిషన్‌రావు, డా. సునీల్ పాల్గొన్నారు.

బతుకమ్మకుంట పునరుద్ధరణకు చర్యలు

- హైడ్రా తవ్వకాలు చేపట్టడంతో ఆరు ఫీట్లకే ఉబికి వచ్చిన నీరు
- గంగమ్మకు పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు
- బతుకమ్మ ఆడిపాడిన మహిళా నాయకులు

అంబర్‌పేట: అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంట పునరుద్ధరణకు ఓ అడుగు ముందుపడటంతో స్థానికులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అన్నారు. ఎన్నో వివాదాల నేపథ్యంలో రంగంలోకి దిగిన హైడ్రా ఎట్టకేలకు బతుకమ్మకుంట పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా హైడ్రా చేపట్టిన కుంట పునరుద్ధరణ చర్యల కోసం తవ్వకాలు చేపట్టడంతో ఆరు ఫీట్లకే నీరు ఉబికి వచ్చిందన్నారు. దీంతో ఇక్కడ కుంట ఉన్నట్లు సాజీవసాక్ష్యం లభించినట్లు అంతా భావిస్తున్నారు. నీరు రావడంతో బుధవారం వి.హనుమంతరావు, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గంగమ్మ పూజ చేశారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆడారు.

◆ ఈ సందర్భంగా వీహెచ్, రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... బతుకమ్మకు తానే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పుకునే కల్వకుంట్ల కవిత పదేళ్లు అధికారంలో ఉన్నా బతుకమ్మకుంట పునరుద్ధరించలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన కబ్జాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా విముక్తి చేసుకుంటూ వెళ్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌యాదవ్, లక్‌పతి యాదగిరిగౌడ్, జ్యోతిగౌడ్, సత్తిబాబు గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శంభూల ఉషాశ్రీకాంత్‌గౌడ్, మోతె రోహిత్, తొలుపునూరి కృష్ణగౌడ్, రామ్మోహన్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ కుంటలో గంగమ్మకు పూజాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బతుకమ్మకుంట వద్ద బతుకమ్మ ఆడుతున్న కాంగ్రెస్ మహిళా నేతలు



రెడ్ బిల్డింగ్ ప్రాంతంలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం.!

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కాంక్రీట్ వాహనం

అంబర్‌పేట: సీసీ రోడ్డు నిర్మాణం కోసం కాంక్రీట్‌తో వచ్చిన వాహనం బాగ్అంబర్‌పేట రెడ్ బిల్డింగ్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనతో మంగళవారం అర్ధరాత్రి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. బుధవారం విద్యుత్ సరఫరాకు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఘటన స్థలానికి కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి చేరుకుని పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఆమెకు తెలిపారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



ఘటన స్థలానికి చేరుకున్న కార్పొరేటర్ పద్మ